## లక్షాయాభైవేలకు మించి వెళ్తున్నాం



రజతోత్సవ సభకు కరీంనగర్ జిల్లా నుంచి లక్షా యాభై వేల మంది వెళ్లాలని నిర్ణయించుకున్నాం. కానీ, ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి వస్తున్న స్పందన చూస్తే నిర్ణీత లక్ష్యానికి మించి సభకు రావడానికి సిద్ధమయ్యారు. మేం ప్రజల్లోకి వెళ్తుంటే ఎవరూ చూసినా సభకు మేం వస్తామంటూ సంఘీభావం ప్రకటిస్తున్నారు. అంతేకాదు, ఎవరికి వారే సభకు స్వచ్ఛందంగా తరలివస్తామని చెబుతున్నారు. ఇది మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నది. ఇప్పటికే సభకు వెళ్లడానికి పార్టీ పరంగా కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు సమకూర్చుతున్నా అవి సరిపోయేలా లేవు. దీంతో పార్టీ శ్రేణులు తమ సొంత వాహనాల్లో ప్రజలను సభకు తీసుకెళ్లడానికి ప్లాన్ చేశారు. ప్రజలు, పార్టీ శ్రేణులకు తాగునీటి సౌకర్యంతోపాటు భోజన వసతి కల్పిస్తున్నాం. ఎక్కడికక్కడే వాహనాల్లో ఇవి సమకూరేలా చర్యలు తీసుకుంటున్నాం. వీలైన మేరకు మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు ప్లాన్ చేశాం. గత మీటింగ్‌లకు భిన్నంగా రజతోత్సవ సభ కనిపిస్తున్నది. గతంలో బీఆర్ఎస్ అనేక సమావేశాలు, సభలు నిర్వహించిన విషయం తెలిసిందే. అప్పుడు పిలిస్తేనే వచ్చేవారు. కానీ, ఇప్పుడు పిలువకపోయినా, సమాచారం ఇవ్వకపోయినా.. గడపగడప నుంచి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న తీరు కేసీఆర్‌పై ఉన్న అభిమానానికి నిదర్శనంగా చెప్పొచ్చు. కేసీఆర్ ఏమి మాట్లాడుతారో.. అన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తున్నది. ప్రజల స్పందన చూస్తే అంచనాలకు వచ్చే అవకాశమున్నది. సాయంత్రం నాలుగు గంటలలోపు సభకు చేరుకునేలా ప్లాన్ చేశాం.

**- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు**

## అంచనాలకు మించి స్పందన




జగిత్యాల జిల్లా నుంచి 20 వేలకుపైగా గులాబీ దండు కదలి వెళ్లడానికి సిద్ధమైంది. అందుకోసం అన్ని ఏర్పాట్లూ చేశాం. అయితే ఊరురా స్పందనను చూస్తే వాహనాలు సరిపోయే పరిస్థితి లేదు. ఈ విషయాన్ని ప్రజలు, పార్టీ శ్రేణులు అర్థం చేసుకున్నారు. అందుకే ఏ గ్రామానికి ఆ గ్రామం పార్టీ శ్రేణులు.. అక్కడి ప్రజలతో స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సొంతంగా ఏర్పాట్లు చేసుకుంటున్న తీరు సభ విజయవంతం అవుతుందని చెప్పడానికి నిదర్శనం. సభకు వచ్చే ప్రజలకు భోజన, తాగునీటి వసతి కల్పించేందుకు పార్టీ పరంగా ఏర్పాట్లు చేస్తున్నాం. అంతేకాదు, ఎవరికి వారే భోజనాలు సమకూర్చుకొని వారి వారి బస్సుల్లో బయలు దేరేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. సభకు రైతులు, మేధావులు, యువకులు, న్యాయవాదులు ఇలా ఒక వర్గం కాదు, సబ్బండ వర్గాలు తరలి రావడానికి ఆసక్తి చూపుతున్నాయి. జగిత్యాల జిల్లా నుంచి వచ్చే వారికి పార్కింగ్ ఇబ్బంది కాకుండా ఉండేందుకు శుక్రవారమే సభాస్థలి వద్దకు వెళ్లి వచ్చాం. ఆ విషయాన్ని పార్టీ శ్రేణులకు టెలిఫోన్ కాన్ఫరెన్స్ ద్వారా వివరిస్తున్నాం. హామీలు ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. అంతేకాదు, నాటి కేసీఆర్ పాలన, నేటి కాంగ్రెస్ పాలనకు బేరీజు వేసుకుంటున్న ప్రజలు.. ఈ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో అంచనాలకు మించి జనం వస్తారన్న నమ్మకం మాకున్నది. అంతేకాదు, ఎవరిని చూసినా ఆరోజు కేసీఆర్‌ను చూడాలి.. మళ్లీ సంఘీభావం తెలుపాలన్న ఆసక్తి కనిపిస్తున్నది.

**- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు**

## రేపటి సభకు ఇలా వెళ్దాం



ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభా ప్రాంగణానికి సులువుగా చేరుకునేలా జోన్లవారీగా రూట్ మ్యాప్‌లను సిద్ధం చేశారు. లక్షలాదిగా తరలి వచ్చే బీఆర్ఎస్ బంధు గణం కోసం 5 జోన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జోన్ల వారీగా ప్రత్యేకంగా 5 పార్కింగ్ జోన్లను సైతం సిద్ధంచేశారు. సభా ప్రాంగణానికి మొత్తం నాలుగు రహదారుల గుండా వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.




**కరీంనగర్ రూట్ :** ఇది 563వ జాతీయ రహదారి. ఈ రూట్ గుండా ఉమ్మడి కరీంనగర్, ఈస్ట్ ఆదిలాబాద్ (సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొంత పరకాల నియోజకవర్గాలు) నుంచి కార్యకర్తలు తరలివస్తారు.

**జోన్ 4:** కరీంనగర్ జాతీయ రహదారి 563 మీదుగా వచ్చే వాహనాలు హుజూరాబాద్, కోతులనడుమ, గ్రానైట్ క్వారీ మీదుగా ఈ పార్కింగ్ జోన్-4కు వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.




సిరిసిల్ల రూరల్: మండెపల్లిలో ముస్తాబైన బీఆర్ఎస్ జెండా గద్దె

# గులాబీదండు రజతోత్సాహం

ఉమ్మడి జిల్లా గులాబీ దండు దుమ్మురేపేందుకు సిద్ధమైంది. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అంచనాలకు మించి తరలివెళ్లేందుకు సన్నద్ధమైంది. సభకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు, పార్టీ శ్రేణులకు పార్టీ పరంగా సౌకర్యాలు కల్పించేందుకు నాయకత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తుండగా, పలు ప్రాంతాల్లో ఎవరికి వారే స్వచ్ఛందంగా బయలుదేరి వెళ్లడానికి కావాల్సిన సౌకర్యాలు సమకూర్చుకుంటున్నారు. మరోవైపు పల్లె నుంచి పట్నం వరకు అంతా గులాబీమయం అవుతుండగా, సభకు బయలు దేరే ముందు పల్లె, పట్నం అన్న తేడా లేకుండా గులాబీ జెండా ఎగురవేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరంభం నుంచి నేటివరకు బీఆర్ఎస్‌కు అండగా నిలిచిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా.. మరోసారి రజతోత్సవ సభ సందర్భంగా తన సత్తాను చాటబోతున్నది. అంచనాలకు మించి ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివెళ్లి, తమ సంపూర్ణ మద్దతు ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నది. పార్టీ ఏర్పాట్లతో సంబంధం లేకుండా సభకు స్వచ్ఛందంగా తరలి వెళ్లి తమ సంఘీభావం తెలిపేందుకు సబ్బండవర్గాలు సిద్ధమవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అదివారం ఉమ్మడి జిల్లా దారులన్నీ ఎల్కతుర్తి సభవైపే పరుగులు పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లా నుంచి రెండు లక్షల పై చిలుకు దండు కదలివెళ్లేందుకు సిద్ధమైనట్టు పార్టీ అధ్యక్షులు చెబుతున్నారు. ప్రజల స్పందనను చూస్తే అంచనాలకు మించి సభ విజయవంతం అవుతుందన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

*- కరీంనగర్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- పల్లె నుంచి పట్నం వరకు గులాబీ మయం
- గ్రామగ్రామానా జెండాలు ఎగురవేసి ఎల్కతుర్తికి బయలుదేరేందుకు సిద్ధం
- పార్టీ శ్రేణులు, ప్రజల నుంచి అనూహ్య స్పందన
- ఆసక్తి చూపుతున్న సబ్బండవర్గాలు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న పార్టీ శ్రేణులు
- రెండు లక్షల మంది వెళ్లేందుకు ఏర్పాట్లు
- స్వచ్ఛందంగా వంటలు.. బస్సుల్లోనే భోజనాలు
- ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జోష్

## రెట్టింపు ఉత్సాహం కనిపిస్తున్నది



రజతోత్సవ సభకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 20 వేల పైచిలుకు మందిమి తరలి వెళ్తున్నాం. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. అయితే జిల్లాలో ఏ మూలకు వెళ్లినా స్వచ్ఛందంగా వస్తామంటూ చెబుతున్న ప్రజల సంఖ్య మా అంచనాలకు మించి కనిపిస్తున్నది. పార్టీ పరంగా 20వేల మంది వెళ్లాలని అనుకున్నా.. ఈ సంఖ్య ఎక్కడి వరకు వెళ్తుందో తెలియని పరిస్థితి ఉన్నది. గతంలో ఏ సభకురాని స్పందన ప్రస్తుతం రజతోత్సవ సభకు కనిపిస్తున్నది. ప్రతి గ్రామం, పట్నం అన్న తేడా లేకుండా ఎవరికి వారే దండులా కదలి రావడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏ ఊరికి ఆ ఊరు ప్రజలు, పార్టీ శ్రేణులే స్వచ్ఛందంగా వంటలు వండుకొని బస్సుల్లో పెట్టుకొని రావడానికి సిద్ధమయ్యారంటే స్పందన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదయం పది గంటలకే మా జిల్లా నుంచి సభకు బయలుదేరుతాం. ముందుగా గ్రామగ్రామానా జెండా ఎగురవేస్తాం. ఆ తర్వాత సభకు వెళ్తాం. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఆ రోజు దారులన్నీ ఎల్కతుర్తి వైపే కనిపిస్తాయి. ఇప్పటికే ప్రతి గ్రామం గులాబీమయం అయింది. ప్రధానంగా చాలా కాలం తర్వాత జరుగుతున్న అతి పెద్ద సభ కావడంతో ప్రతి గులాబీ కార్యకర్త వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఊహకు అందని రీతిలో మీటింగ్ జరుగుతుందన్న అంచనాలు మాకున్నాయి. సభకు తరలి వచ్చే వారి కోసం పార్టీ పరంగా సహకారం అందించేందుకు మా ఇన్‌చార్జీలు, మేం ప్రయత్నాలు చేస్తున్నాం.

**- బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**




*రజతోత్సవ సభకు రావాలని రామగుండంలో వాల్ రైటింగ్స్*

## కేసీఆర్‌ను చూడాలన్న ఆత్రుత ఉన్నది



పెద్దపల్లి జిల్లా నుంచి 20వేలకుపైగా మందిమి తరలి వెళ్తున్నాం. అందుకు సంబంధించి నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో కలిసి ఏర్పాట్లు చేశాం. అయితే కేసీఆర్ రజతోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు ప్రకటించిన తర్వాత ప్రజల్లోకి వెళ్లి చూస్తే.. ఎప్పుడెప్పుడు కేసీఆర్‌ను చూడాలన్న ఆత్రుత ప్రజల్లో కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలోనే రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా రావడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్న విషయం మాకు స్పష్టంగా అర్థమవుతున్నది. అలాగే సింగరేణి కార్మికులు సైతం భారీగా తరలి వచ్చి కేసీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకుంటున్న తీరు కేసీఆర్‌పై ఉన్న అభిమానానికి నిదర్శనం. అలాగే సభకు వచ్చే ప్రజలు, పార్టీ శ్రేణుల కోసం తాగు నీరు, భోజన వసతి వంటివి ఏర్పాట్లు చేసుకున్నాం. ఆదివారం ఉదయమే ఎల్కతుర్తి సభకు బయలు దేరి వెళ్తాం. ప్రతి ఊరు, వాడ నుంచి బయలు దేరి రావడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. గతానికి భిన్నంగా ఈసారి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈవర్గం ఆ వర్గం అని కాకుండా సబ్బండ వర్గాలు రజతోత్సవ సభకు తరలి రావడానికి మెజార్టీ ప్రాంతాల్లో స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు కేసీఆర్ పాలన దక్షత విలువ అర్థమైనట్టు తెలుస్తున్నది. అంచనాలకు మించి వస్తున్న స్పందనను చూస్తే.. సభ సంపూర్ణంగా విజయవంతం అవుతుందన్న విశ్వాసం మాకు ఉన్నది. అంతటా గులాబీ పండుగ వాతావరణం ఇప్పటికే కనిపిస్తున్నది.

**- బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్**

## విజయవంతం చేయాలి

వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, ఏప్రిల్ 25: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలివచ్చి సక్సెస్ చేయాలని వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. వేములవాడ సెగ్మెంట్ నుంచి దాదాపు 10వేల మందికి పైగా తరలివస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఎల్కతుర్తిలో సభా ప్రాంగణాన్ని, పార్కింగ్ స్థలాలు, బహిరంగ సభ, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. తెలంగాణ కోసం పుట్టి పోరాడి రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల పండుగను అబ్బురపరిచేలా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, మండలాధ్యక్షులు గోస్కుల రవి, మ్యాకల ఎల్లయ్య, మల్యాల దేవయ్య, రవి, సత్తిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి ఉన్నారు.


## రజతోత్సవ సభకు దుబాయ్ నుంచి..

- ఎమ్మెల్యే గంగుల పిలుపు మేరకు రాక

కరీంనగర్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): రజతోత్సవ సభకు దుబాయ్‌లోని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం నాయకులు తరలివస్తున్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపు మేరకు సయ్యద్ అమ్జద్ అలీ ఆధ్వర్యంలో 13 మంది బృందం శుక్రవారం దుబాయ్ నుంచి బయలుదేరారు. వారిలో సయ్యద్ అన్వర్ హుస్సేన్, మహమ్మద్ సలావుద్దీన్, నవాజ్ ఖాన్, అష్రఫ్ అలీ, ఖలీద్ మహబూబ్, మోసిన్ బిన్, చింతకుంట గంగయ్య తదితరులు ఉన్నారు.




దుబాయ్ నుంచి బయలు దేరే ముందు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం నాయకులు



కార్యాలయం ఆవరణలో పోటెత్తిన రాజీవ్ యువ వికాసం అభ్యర్థులు

## యువ వికాసం.. తప్పని గోస



సొమ్మసిల్లి పడిపోయిన అభ్యర్థి

కోల్‌సిటీ, ఏప్రిల్ 25: రామగుండం బల్దియా కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన గందరగోళంగా మారింది. అధికారుల ప్రణాళిక లోపంతో అభ్యర్థులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. మూడోరోజు శుక్రవారం వేలాది మంది పోటెత్తారు. ఆయా బ్యాంకుల నుంచి కేవలం ఒక్కరు మాత్రమే రావడం, దరఖాస్తుల పరిశీలన నెమ్మదిగా సాగడంతో బయట ఎండదగడు, దూపకు తట్టుకోలేక అభ్యర్థులు నరకం చూశారు. ఒక దశలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ బలవంతంగా కార్యాలయంలోకి వచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో లెనిన్ నగర్‌కు చెందిన యువకుడు సంతోష్‌కుమార్ అలియాస్ చంటి సొమ్మసిల్లి పడిపోగా, అధికారులు దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి కార్యాలయానికి చేరుకొని తమ సిబ్బంది సాయంతో అభ్యర్థులను కట్టడి చేశారు.

## శాతవాహనలో మంటలు



కాలిపోతున్న సమాధాన పత్రాలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 25: శాతవాహన యూనివర్సిటీలో మంటలు చెలరేగాయి. గురువారం మధ్యాహ్నం నుంచే అంటుకున్నట్లు తెలుస్తుండగా, సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట వరకు మంటలను అదుపులోకి తెచ్చి వెళ్లిపోయారు. అయితే మళ్లీ ఉదయం మంటలు చెలరేగడంతో సిబ్బంది గుర్తించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖ డీఎఫ్FY శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎఫ్‌వో రాజ్ కుమార్ సిబ్బందితో అక్కడి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కానీ అప్పటికే ఎగ్జామినేషన్ బ్రాంచ్ ఆధీనంలో ఉన్న ఓల్డ్ పేపర్స్ గోడౌన్ వరకు మంటలు వ్యాపించి 2022, 2023 సంవత్సరం విద్యార్థులకు చెందిన పరీక్ష సమాధాన పత్రాలు కాలిపోయాయి. అయితే, మంటలు గోడౌన్ వెనుక వ్యాపించి, అద్దాలు పగలడంతో గదిలోకి లోపలికి విస్తరించి పేపర్లు కాలిపోయినట్టు అధికారులు నిర్ధారించారు. కాగా, ప్రతి సంవత్సరం పరీక్షలు పూర్తయిన తర్వాత సమాధాన పత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారానే మూల్యాంకనం చేస్తారని, ఆ పేపర్స్‌ను రెండు, మూడేండ్లు స్టోర్ చేసి ఆ తర్వాత స్క్రాప్‌గా అమ్మేస్తారని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. అయితే ఒక వైపు నుంచి వచ్చిన మంటలు అదే దారిలో వ్యాప్తి చెందకుండా మరోవైపు నుంచి రావడం పలు అనుమానాలు రేకెత్తిస్తుండగా, ఈ విషయాన్ని ఫైర్ అధికారులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.